సాక్షి నిజామాబాద్


శుక్రవారం । 21 । మార్చి । 2025



ఆరు గ్యారంటీల అమలు

ఎన్నికల హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేశామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి అన్నారు.

- II లో ▸



గరిష్టం/కనిష్టం
40.3 /20.3

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

డీఎల్‌ఎస్‌ఏలో నూతన సభ్యుల నియామకం




ఖలీల్‌వాడి: జిల్లా న్యాయసేవాధికార సంస్థలో ముగ్గురు సభ్యులు నియమితులయ్యారు. సోషల్ వర్కర్ ఆర్ సురేందర్, న్యాయ రంగం నుంచి జీ రవి ప్రసాద్, వైద్య రంగం నుంచి డాక్టర్ కవితారెడ్డిని నూతన సభ్యులుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ లీగల్ ఎఫైర్స్ సెక్రెటరీ, లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్ ఆర్ తిరుపతి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. నూతన సభ్యులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ సిబ్బంది నాగేందర్, లైజనింగ్ ఆఫీసర్ శ్యామ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిబ్బందికి కళ్లద్దాలు, వాటర్ బాటిళ్లు



ఖలీల్‌వాడి : ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ సిబ్బందికి సీపీ పోతరాజు సాయిచైతన్య కళ్లద్దాలు, వాటర్ బాటిళ్లను అందజేశారు. రవీంద్ర మెడికల్ ఏజెన్సీ సౌజన్యంతో గురువారం కమిషనరేట్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతిరోజూ మండుటెండను తట్టుకుని ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారన్నారు. సిబ్బందికి ఎలాంటి అవసరం ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, సీఐ ప్రసాద్, రవీంద్ర ఫార్మసీ బాధ్యులు మధుసూదన్, సుధాకర్, సాయిలు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధుల నిర్ధారణ పరీక్షలను పెంచండి



నిజామాబాద్‌నాగారం: అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలను నిర్దేశించిన లక్ష్యాలకనుగుణంగా చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి రాజశ్రీ సంబంధిత అధికారులను ఆదేశించారు. లక్ష్యం కంటే తక్కువ పరీక్షలు చేసిన ఆరోగ్య ఉప కేంద్రాల సిబ్బంది, ఏఎన్‌ఎం, ఎమ్‌హెచ్‌పీల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ..

లక్ష్యాన్ని అందరూ ఈనెల చివరికల్లా పూర్తి చేయాలన్నారు. లేనిపక్షంలో మెమోలు జారీ చేస్తామన్నారు. అదేవిధంగా ఆరోగ్య ఉప కేంద్రం, పీహెచ్‌సీ స్థాయిలలో అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు జరిగే తీరును ఆరోగ్య ఉప కేంద్రాల వారిగా సమీక్షించడంతోపాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్నందున ఎవరూ కూడా వడదెబ్బకు గురికాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఓఆర్‌ఎస్, ఐవీ ఫ్లూయి డ్స్, అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కూలీల పనివేళల్ని ఉదయం 6 గంటల నుంచి 11 గంటలు లోపే ఉండేలా చూడాలని సూచించారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సామ్రాట్ యాదవ్, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ పి.వెంకటేశం, జిల్లా ఆరోగ్య విద్యా బోధకులు ఘన్పూర్ వెంకటేశ్వర్లు, హెచ్‌ఈవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిలువ నీడ లేదు | నడువ దారి లేదు

రాష్ట్రంలో మూడో పెద్ద నగరంగా గుర్తింపు ఉన్న నిజామాబాద్‌లో ఎక్కడా బస్ షెల్టర్లు కనిపించడం లేదు. బస్సుల కోసం వేచి ఉండేవారు రోడ్ల పక్కనే పడిగాపులు కాయాల్సి వస్తోంది. నగరానికి ప్రతిరోజూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారితోపాటు చుట్టుపక్కల జిల్లాల నుంచి, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలనుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పనుల నిమిత్తం వచ్చి వెళ్తుంటారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమణకు గురికావడంతో కనీసం నడిచేందుకు వీలు లేకుండా ఉంటోంది. నిజామాబాద్ నగరానికి వచ్చే వారు 'నడువ దారి లేదు.. బస్సుల కోసం నిలువ నీడ లేదు' ఇదేం నగరమంటూ పెదవి విరుస్తున్నారు.

SAKSHI FOCUS

- బస్సులు ఎక్కడ ఆపాలో డ్రైవర్లకు అర్థంకాని పరిస్థితి
- తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం
- త్వరలో నగరానికి 50 ఎలక్ట్రిక్ బస్సులు రానున్న నేపథ్యంలో గందరగోళం

బాన్సువాడ వైపు నుంచి వచ్చిన బస్సులో నుంచి రోడ్డుపై దిగుతున్న బాలుడు, వృద్ధురాలు



ఫుట్‌పాత్ లేకపోవడంతో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళలు, పురుషులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్ తరువాత పెద్ద నగరంగా ఉన్న నిజామాబాద్‌లో బస్ షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు, నగరవాసులకు తిప్పలు తప్పడం లేదు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణతో పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. నలుమూలలకు విస్తరించిన నగరంలో రైల్వే స్టేషన్, వర్ని క్రాస్‌రోడ్, పాత బస్టాండ్ (బోధన్ రోడ్డు), ఆర్‌ఆర్ చౌరస్తా, పులాంగ్ చౌరస్తా, లక్ష్మారెడ్డి ఆస్పత్రి, కోర్టు చౌరస్తా, బైపాస్ రోడ్, గూపన్‌పల్లి కమాన్, రిలయన్స్ మాల్, రుక్మిణి చాంబర్స్, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, మాలపల్లి (ఫ్రూట్ మార్కెట్), అర్సపల్లి కమాన్, కంఠేశ్వర్ వద్ద బస్



జిల్లా కేంద్రంలో కానరాని బస్ షెల్టర్లు

షెల్టర్లు అత్యావశ్యకం. ప్రతి స్టేజ్ వద్ద 10 మందికి పైగా బస్సు ఎక్కే, దిగే వారుంటారు. అయినప్పటికీ ఈ ప్రాంతాల్లో బస్ షెల్టర్లు కనిపించవు. దీంతో నగర వాసులతోపాటు జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగించే మండలాల ప్రజలు, ఇతర జిల్లాలు, హైదరాబాద్‌కు వెళ్లివచ్చే వారికి ఇబ్బందులు కలుగుతున్నాయి. రైల్వే స్టేషన్ వద్ద ఆర్టీసీ బస్సులు నిలిపేందుకు అనువైన స్థలం లేదు. ఇక్కడ ఒక్క బస్సు ఆపితే దాని వెనకాలే నాలుగైదు బస్సులు ఆగిపోతున్నాయి. ఇక్కడ నిరంతరం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఇక రైల్వేస్టేషన్ – బస్టాండ్ రూట్‌లో కాలినడకన రాకపోకలు సాగించే వారు సైతం అనేక అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఫుట్‌పాత్‌లు



ఫుట్‌పాత్‌ను ఆక్రమించి నిలిపిన వాహనాలు

అనేవే లేవు. దీంతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో నడిచివెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. మరో

యథేచ్ఛగా ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు

వైపు నగరంలో చాలాచోట్ల ఫుట్‌పాత్‌లు ఉన్నప్పటికీ వీటిని 90 శాతానికిపైగా ఆక్రమించి పలువురు వ్యాపారాలు చేస్తున్నారు. కాలినడకన వెళ్లేవారు ప్రధాన రోడ్లపైనుంచే నడవాల్సి వస్తోంది. దీంతో ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడుతోంది. త్వరలో నగరంలో సర్వీసులు నడిపేందుకు గాను 50 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. ఈ నేపథ్యంలో ఫుట్‌పాత్‌లు, బస్‌షెల్టర్లు తప్పనిసరి కావడంతో మున్సిపల్ అధికారులు తగినవిధంగా చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్‌కుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా అన్నింటినీ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఫుట్‌పాత్‌ల ఆక్రమణతో ఇబ్బందులు



నగరంలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించడంతో పాదచారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వేగంగా దూసుకొచ్చే వాహనాలు ఢీకొడుతున్నాయి. అసలు ఫుట్‌పాత్‌లు అనేవే కనిపించకుండా ఆక్రమించడం కారణంగా అంతా గందరగోళంగా ఉంటోంది. అధికారులు స్పందించి ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలి.

– ముత్యాల వినోద్, నిజామాబాద్

బస్సులు ఆపడం లేదు



నిజామాబాద్‌లో తిరిగేందుకు సిటీ బస్సులుండాలి. ఆటోలు ఎక్కితే డబ్బులు బాగా అడుగుతున్నారు. బాన్సువాడ నుంచి వచ్చే బస్సులు నాగారం వద్ద ఆపడం లేదు. బస్టాప్‌లు లేకపోవడంతో బస్సులను నడి రోడ్డుమీదనే ఆపుతున్నారు. దీంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు ఢీకొంటున్నాయి. – సరస్వతి, నాగారం

బస్టాప్‌లు ఏర్పాటు చేయాలి



ఇందూరులో బస్టాప్‌లు లేవు. గొల్లగుట్ట నుంచి నిత్యం మార్కెట్‌కు వస్తుంటా. బస్సు కోసం రోడ్డు మీదనే ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంది. వర్షం పడినప్పుడు, బాగా ఎండలు ఉన్నప్పుడు రోడ్డు మీద బస్సు కోసం ఎదురు చూడటం కష్టంగా ఉంటోంది. అధికారులు వెంటనే బస్టాప్‌లు ఏర్పాటు చేయాలి. – కవిత, గొల్లగుట్టవాసి



రైల్వే స్టేషన్ ఎదుట బస్సులు నిలిచే ప్రాంతంలో ఆటోలు

ట్రాఫిక్‌ను నియంత్రించాలి



నగరంలోని రోడ్లపై వాహనాలను ట్రాఫిక్ నిబంధనల మేరకు నడిపించాలి. ఆటో లను నియంత్రించాలి. జన సంచారం ఉండే ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుంటున్నారు. వాటిని తొలిగించి ట్రాఫిక్ ను క్లియర్ చేయాలి. ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను నియంత్రణ చర్యలు చేపట్టాలి. – అనిల్, నిజామాబాద్

సర్వం సిద్ధం

- నేటి నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం
- 141 సెంటర్ల ఏర్పాటు.. పరీక్ష రాయనున్న 22,915 మంది విద్యార్థులు
- హాల్ టికెట్‌పై తప్పలుంటే పరిశీలించి అనుమతిస్తాం : డీఈవో

మొత్తం విద్యార్థులు	22915
బాలికలు	11,239
బాలురు	11,418
ప్రైవేట్ విద్యార్థులు	258

సెంటర్లు 141	సిట్టింగ్ స్క్వాడ్‌లు 141

సమాచారం కోసం సంప్రదించాల్సిన నంబర్
90302 82993

పరీక్ష సమయం
ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30



జిల్లా కేంద్రంలోని హరిచరణ్ మార్వాడి స్కూల్‌లో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. పరీక్ష సెంటర్లను సిద్ధం చేశారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లను నియమించి శిక్షణ ఇచ్చారు. ఎలాంటి లోపాలకు తావులేకుండా పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలిపారు. పరీక్షల నిర్వహణపై గురువారం పాఠశాల డైరెక్టర్ నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో డీఈవో పాల్గొన్నారు. ఇంటర్‌నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌పై తప్పులు ఉంటే ఆందోళన చెందొద్దని, ఎగ్జామినేషన్ సెంటర్‌లో చీఫ్ సూపరింటెండెంట్ పరిశీలించి అనుమతిస్తారని అధికారులు తెలిపారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపట్టనున్నాయి. సెంటర్లలో సదుపాయాలు కల్పించడంతోపాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు.

ప్రతి ఇంటికీ మంచినీరందించాలి

- మౌలిక సదుపాయాలను మెరుగు పర్చాలి
- మాస్టర్‌ప్లాన్‌పై అధికారులతో చర్చించాం
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- నిజామాబాద్ నగరంలో అభివృద్ధి పనుల ప్రగతిపై సమీక్ష



సమావేశంలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యే ధన్‌పాల్, కలెక్టర్ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: ప్రజలకు మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు వీలుగా ఆయా పథకాల కింద నగర పాలక సంస్థ పరిధిలో చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి అమృత్ 2.0 పథకం పనుల ప్రగతిపై గురువారం సమీక్షించారు. వేసవి సీజన్‌లో నగరంలోని ఇంటింటికీ రక్షిత మంచినీరు సరఫరా అయ్యేలా పకడ్బందీ పర్యవేక్షణ చేపట్టాలన్నారు. రోడ్లు, ఇతర పెండింగ్ పనులను పూర్తి చేయించేందుకు కృషి చేస్తున్నామని, సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నిజామాబాద్ మాస్టర్ ప్లాన్‌పై ఉన్నతాధికారులతో ఇటీవలే చర్చించామని తెలిపారు. మాస్టర్ ప్లాన్ అమలైతే నిజామాబాద్ నగరం మరింత వేగంగా అభివద్ధి చెందే ఆస్కారం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇతర మున్సిపాలిటీలతో పోలిస్తే నగరపాలక సంస్థ పనితీరు కలెక్టర్ పర్యవేక్షణలో ఎంతో బాగుందని షబ్బీర్ అలీ ప్రశంసించారు. సమావేశంలో నుడా చైర్మన్ కేశ వేణు, మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, పబ్లిక్ హెల్త్, మిషన్ భగీరథ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే ధన్‌పాల్ పంపిణీ చేశారు. నిజామాబాద్ సౌత్, నార్త్ మండలాలకు చెందిన 565 మందికి రూ. 5.65 కోట్ల పైచిలుకు విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ప్రభుత్వం అప్పుల్లో ఉన్నా పేదలను ఆదుకోవడానికి ఎంతో కృషి చేస్తోందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పథకాలను అమలు చేస్తోందన్నారు.

వర్ష సూచన... రైతుల్లో ఆందోళన

- వడగళ్లు కురిసే అవకాశం



దొంకేశ్వర్(ఆర్మూర్): వాతావరణ మార్పులతో జిల్లాలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. వడగళ్లు కూడా కురిసే అవకాశం ఉన్నట్లు హెచ్చరించింది. ఈ మేరకు గురువారం జిల్లా వ్యవసాయ, ఇతర సంబంధిత అధికారులకు సమాచారాన్ని చేరవేసింది. సమాచారం అందే సమయానికి జిల్లాలో వాతావరణ పరిస్థితులు సైతం మారిపోయాయి. సాయంత్రం 6 గంటల తర్వాత ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులు కనిపించాయి. బోధన్ మండలం కల్దుర్కి, సాలూరా ప్రాంతాల్లో స్వల్పంగా వర్షం కురిసింది. అయితే రైతులు యాసంగిలో సాగు చేసిన వరి పంట చేతికొచ్చే దశలో ఉంది. బోధన్ లాంటి కొన్ని చోట్ల వరికోతలు కూడా మొదలయ్యాయి. మామిడి తోటల్లో కూడా కాయలు మధ్య దశలో ఉన్నాయి. ఇలాంటి సమయంలో జిల్లాకు వర్షాలు, వడగళ్ల సూచన రావడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వరి, మామిడి పంటలపై వడగళ్లు ఎక్కడ దాడి చేస్తాయోనని కలవరపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 4.20 లక్షల ఎకరాల్లో వరి సాగవగా 1లక్షల ఎకరానికి పైగా కోత దశలో ఉంది. గతేడాది కూడా దే సమయంలో వడగళ్ల వాన పంటలను దెబ్బతీసి రైతులను నష్టానికి గురిచేసింది.

అంబేద్కర్ ఓవర్సీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించేందుకు విద్యార్థులు అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిణి నిర్మల గురువారం ఒక ప్రకటనలో కోరారు. స్కాలర్‌షిప్ కోసం అభ్యర్థులు ఈనెల 20 నుంచి మే 19వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని ఆమె సూచించారు.

రేపు మున్సిపల్ కమిషనర్‌తో 'సాక్షి' ఫోన్‌ఇన్




నిజామాబాద్ నగర ప్రజలు తాగునీరు, డ్రెయినేజీ వ్యవస్థ, ఇతర సమస్యలపై నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ దిలీప్ కుమార్‌తో నేరుగా మాట్లాడొచ్చు.

తేది : 22-03-2025 (శనివారం)

సమయం : ఉదయం 10.30 గంటల నుంచి 11.30 వరకు..

ఫోన్ చేయాల్సిన నంబర్: 78159 57047 / 9989709595

దూసుకొచ్చిన మృత్యువు

- విధుల్లో ఉన్న పోలీసులను ఢీకొన్న కారు
- ఓ కానిస్టేబుల్ మృతి, మరో కానిస్టేబుల్‌కు గాయాలు
- గాంధారిలో వేకువజామున కలకలం రేపిన ఘటన



రవికుమార్ (ఫైల్)

కామారెడ్డి క్రైం/గాంధారి: తెల్లవారుజామున గాంధారి నడిబొడ్డున అదుపుతప్పిన ఓ కారు బీభత్సం సృష్టించింది. బీట్ విధులు నిర్వహిస్తున్న పోలీసులపైకి దూసుకు రావడంతో ఓ కానిస్టేబుల్ అక్కడికక్కడే మరణించగా మరొకరు గాయాలతో బయటపడ్డారు. గురువారం వేకువజామున 3 గంటలకు ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గాంధారి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు వద్ద రవికుమార్ (35) సుభాష్ హనుమాన్ టిఫిన్ సెంటర్ ఎదురుగా బీట్ డ్యూటీ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో కామారెడ్డి వైపు నుంచి బాన్సువాడ వైపు వెళ్తున్న ఓ కారు అతివేగంగా దూసుకువచ్చి ఢీకొనడంతో రవికుమార్ అక్కడికక్కడే మరణించాడు. కారు దూసుకు రావడాన్ని సెకండ్ల వ్యవధిలో గమనించిన మరో కానిస్టేబుల్ సుభాష్ వేగంగా పక్కకు దూకడంతో స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కారు నడుపుతూ ప్రమాదానికి కారణమైన సన్నిత్‌కు సైతం గాయాలు కావడంతో అతడిని ఆస్పత్రికి తరలించారు. అతడిని స్థానిక ఆర్‌ఎంపీ కుమారుడిగా గుర్తించారు. వాహనం నడుపుతున్న సమయంలో మద్యం మత్తులో ఉండొచ్చని భావిస్తున్నారు.

మిన్నంటిన రోదనలు..

2007 బ్యాచ్‌కు చెందిన రవికుమార్‌ది తాడ్వాయి మండలం దేమె గ్రామం కాగా, కామారెడ్డిలోని దేవునిపల్లిలో స్థిరపడ్డారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని స్పెషల్ బ్రాంచ్ విభాగంలో విధులు నిర్వహించి ఇటీవలే గాంధారికి బదిలీ అయ్యాడు.

అండగా ఉంటాం



కానిస్టేబుల్ తల్లిని ఓదారుస్తున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

కానిస్టేబుల్ రవికుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని ఎస్పీ రాజేశ్ చంద్ర పేర్కొన్నారు. కామారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద రవికుమార్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

క్లుప్తంగా

జిల్లా జడ్జిని కలిసిన సీపీ



ఖలీల్‌వాడి: జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీతా కుంచాలను నిజామాబాద్‌ కోర్టు కార్యాలయంలో సీపీ పోతరాజు సాయిచైతన్య గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్కను అందజేశారు.

సీపీని కలిసిన ప్రొబెషనరీ ఎస్సైలు



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ పోలీస్‌ కమిషనర్‌ పోతరాజు సాయిచైతన్యను ఎనిమిది మంది ప్రొబెషనరీ ఎస్సైలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు. సీపీని కలిసిన వారిలో ప్రొబెషనరీ ఎస్సైలు సుస్మిత, సుహాసిని, కళ్యాణి, రమ, రాజేశ్వర్‌, కిరణ్‌ పాల్‌, శైలేందర్‌, శ్రీనివాస్‌ ఉన్నారు.

వీడీసీపై ఫిర్యాదు

బాల్కొండ: మెండోరా మండలం సావెల్‌ గ్రామంలో తమను వీడీసీ బహిష్కరించిందంటూ గురువారం రెండు కులాల సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామశివారులోని వాగు నుంచి ఇంటి నిర్మాణాలకు ఇసుకను తెచ్చుకుంటే అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఎస్సై నారాయణను 'సాక్షి' వివరణ కోరగా.. సమస్య పరిష్కారానికి చర్చలు జరుపుతున్నామని, శుక్రవారం గ్రామాన్ని సందర్శించి పూర్తిస్థాయి విచారణ చేపడతామని తెలిపారు.

ఆఫీసర్‌ లోపల.. బయట తాళం

- ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌కు తాళం వేసిన మతిస్థిమితం లేని వ్యక్తి



గెస్ట్‌హౌస్‌ తాళం పగులకొడుతున్న సిబ్బంది

కామారెడ్డి టౌన్‌: ప్రభుత్వ అతిథి గృహంలో అధికారి విశ్రాంతి తీసుకుంటుండగా, మతిస్థిమితం లేని వ్యక్తి బయట నుంచి తాళం వేసి వెళ్లిన ఘటన గురువారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. కామారెడ్డి ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం రాత్రి విద్యుత్‌ శాఖకు సంబంధించిన ఒక అధికారి విశ్రాంతి తీసుకున్నారు. గెస్ట్‌హౌస్‌ సిబ్బంది వస్తే ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు లోపల నుంచి గొళ్లెం పెట్టకుండా తాళం సోఫాపై పెట్టి విశ్రాంతి తీసుకున్నారు. గురువారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు పైఅంతస్తులోకి వెళ్లగా అదే సమయంలో ఓ మతిస్థిమితం లేని వ్యక్తి నేరుగా గెస్ట్‌హౌస్‌ లోపలికి వచ్చి సోఫాపై ఉన్న తాళం తీసుకుని డోర్‌కు తాళం వేసి వెళ్లిపోయాడు. కాసేపటికి కిందికి వచ్చిన అధికారి.. డోర్‌కు బయటి నుంచి తాళం వేసి ఉండడంతో కంగుతిన్నారు. సిబ్బందికి ఫోన్‌ చేయగా, సుమారు గంటపాటు శ్రమించి తాళం తీశారు.

సేవ.. ప్రోత్సాహం @ తెలుగు వెలుగు

- ప్రతిభకు పట్టాభిషేకం చేస్తున్న సమాఖ్య
- 45 ఏళ్లుగా సేవలు



భగవద్గీత పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో చంద్రశేఖర్‌



జానపద కళాకారులను సన్మానిస్తున్న చంద్రశేఖర్‌

నిజామాబాద్‌ రూరల్‌: స్వశక్తికి ప్రోత్సాహం తోడైతే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎవరికి వారే యమునతీరే అన్నట్లుగా మారింది. ఇతరులను వెన్నుతట్టి ప్రోత్సహించేవారు అరుదు. విద్యార్థులు, కళాకారులు, వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిని 45 ఏళ్లుగా తోడుగా మేమున్నామంటూ ప్రోత్సహిస్తోంది తెలుగు వెలుగు సమాఖ్య. నిజామాబాద్‌ నగరంలోని సీతారాంనగర్‌ కాలనీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బొక్కసం చంద్రశేఖర్‌రావు 1980లో ఉగాది పండుగ రోజు 'తెలుగు వెలుగు సమాఖ్య'ను నెలకొల్పారు. నాటి నుంచి జిల్లాలో ఆయా రంగాల్లో రాణిస్తున్న ప్రతిభావంతులను సత్కరిస్తూ వారి జీవితాల్లో వెలుగు నింపుతోంది

విద్యార్థులు, కళాకారులకు గుర్తింపు

తెలుగు వెలుగు సమాఖ్య ఏర్పడిన తర్వాత మొదటిసారిగా 1980లో పదో తరగతిలో జిల్లా ప్రథములుగా వచ్చినవారిని బంగారు పతకాలతో సత్కరించారు. సెప్టెంబర్‌ 5న ప్రతి ఏడాది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానిస్తున్నారు. 1986లో జిల్లాలో సాహిత్యసేవ చేస్తున్న కవులు, కళాకారులు సైబా పరంధాములు, వీపీ చందన్‌రావు, కందాళై రాఘవాచార్య, శిల్పి రఘు, గర్శకుర్తి రాజేందర్‌ను సన్మానించారు. 1993లో జిల్లాలో నటుడు ఎన్టీఆర్‌ పేరిట అవార్డును స్థాపించి మొదటి అవార్డును ఇంద్రజాల ప్రదర్శకుడు రంగనాథ్‌కు ప్రదానం చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తూ ప్రతిభాపాటవాలు పెంపొందిస్తోంది. పేద కుటుంబాలకు ఆర్థిక సాయం, ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు నోట్‌బుక్కులు పంపిణీ చేస్తున్నారు. ప్రతి ఏడాది సంక్రాంతి, ఉగాది పురస్కారాలతో కళాకారులను సన్మానిస్తోంది. డాక్టర్స్‌ డే, టైలర్స్‌ డే, ఫొటోగ్రాఫర్స్‌ డే, మాతృభాషా దినోత్సవం, కవి సమ్మేళనాలు నిర్వహిస్తూ 45 ఏళ్లు పూర్తి చేసుకుంటోంది తెలుగు వెలుగు సమాఖ్య. ముఖ్య కార్యదర్శిగా సేవలందిస్తున్న చంద్రశేఖర్‌ ఇప్పటి వరకు ప్రముఖుల ప్రశంసలు, సన్మానాలు పొందారు.



కవులను సన్మానిస్తున్న సభ్యులు (ఫైల్‌)

ప్రతిభను వెలికితీసేందుకే..



కవులు, కళాకారులతో పాటు అన్నిరంగాల వారిని ప్రోత్సహించేందుకు సమాఖ్యను ఏర్పాటు చేశాం. మాతృభాషను బతికించి భావితరాలకు దాని గొప్పదనాన్ని తెలియజేస్తున్నాం. సమాజంలో అన్నివర్గాలకు సేవ చేయడం నా ఆశయం. – చంద్రశేఖర్‌, ప్రధాన కార్యదర్శి

'ఆదుకోండి.. ప్లీజ్‌'

- చిన్నారులకు పెద్దజబ్బులు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



తల్లితో చిన్నారులు

బాల్కొండ: పేద కుటుంబానికి పెద్ద కష్టమొచ్చింది. ఇద్దరు చిన్నారులూ జబ్బులతో బాధపడుతుండడంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెండోరా మండల కేంద్రానికి చెందిన ప్రదీప్‌, విజయ దంపతులకు ముగ్గురు పిల్లలు. పెద్ద కొడుకు లక్షిత్‌(12) హైపర్‌ టెన్షన్‌, కూతురు శ్రీసాన్వీ(6) జంక్‌ఫిట్స్‌ వ్యాధితో మతిస్థిమితం కోల్పోయింది. ప్రతి నెల చిన్నారుల మందుల కోసం రూ.20వేలు ఖర్చవుతోంది. ఒక్కొక్కరి వైద్యానికి రూ.4లక్షల వరకు ఖర్చవుతాయని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ప్రైవేటు పాఠశాలలో పీఈటీగా పని చేసే ప్రదీప్‌కు వచ్చే జీతం పిల్లల మందులకే సరిపోతుంది. దీంతో వైద్యం చేయించే ఆర్థిక స్థోమత లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ఫోన్‌ పే నంబర్‌ 99661 56006కు దాతలు ఆర్థికసాయం అందించాలని ప్రాధేయపడుతున్నారు.

నేడు డయల్‌ యువర్‌ ఆర్టీసీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రీజియన్‌ పరిధి లో శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు డయల్‌ యువర్‌ ఆర్టీసీ నిర్వహించనున్నట్లు ఆర్‌ఎం జ్యోత్స్న తెలిపారు. ఉమ్మడి జిల్లాల ప్రయాణికులు తమ సమస్య లు, సూచనలను నంబర్లకు ఫోన్‌ చేసి తెలపాలన్నారు.

రీజినల్‌ మేనేజర్‌, నిజామాబాద్‌	9959226011
డిపో మేనేజర్‌, ఆర్మూర్‌	9959226019
డిపో మేనేజర్‌, బోధన్‌	9959226001
డీఎం, నిజామాబాద్‌–1	9959226016
డీఎం, నిజామాబాద్‌–2	9959226017
డిపో మేనేజర్‌, కామారెడ్డి	9959226018

టెక్సాస్‌ వర్సిటీతో తెయూ ఎంవోయూ

తెయూ(డిచ్‌పల్లి): ఇరుదేశాల విద్యార్థుల పరిశోధన కోసం అమెరికాలోని టెక్సాస్‌ వర్సిటీ, తెలంగాణ విశ్వవిద్యాలయం ఎంవోయూ కుదుర్చుకున్నాయి. తెయూ ఉపకులపతి ప్రొఫెసర్‌ టీ యాదగిరిరావు, టెక్సాస్‌ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్‌ బొబ్బిలి అనంత సుధాకర్‌ సంతకాలు చేసి ఒప్పందపత్రాలను మార్పిడి చేసుకున్నారు. టెక్సాస్‌ వర్సిటీ వీసీ అనంత సుధాకర్‌ గురువారం తెయూను సందర్శించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ అభివృద్ధికి ఈ పరిశోధనలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

తమ వర్సిటీతో ఒప్పందం జరగడం గర్వకారణమని వీసీ యాదగిరిరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ మామిడాల ప్రవీణ్‌, లా కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రసన్నరాణి, ఇఫ్లూ ప్రొఫెసర్‌ కోన ప్రకాశ్‌ పాల్గొన్నారు.

సదస్సు బ్రోచర్‌ ఆవిష్కరణ



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న వీసీ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయ వాణిజ్య విభాగం నిర్వహించే జాతీయ సదస్సు బ్రోచర్‌ను వీసీ ప్రొఫెసర్‌ యాదగిరి రావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జూన్‌ 24న తెయూ వాణిజ్య విభాగం, తెలంగాణ కామర్స్‌ అసోసియేషన్‌ సంయుక్తంగా 'వికసిత్‌ భారత్‌ –2047 ట్రాన్స్‌ఫార్మెటివ్‌ రోల్‌ ఆఫ్‌ కామర్స్‌' అనే అంశంపై నిర్వహించే సదస్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగం ప్రొఫెసర్‌ రాంబాబు, ప్రిన్సిపాల్‌ ప్రవీణ్‌, గంటా చంద్రశేఖర్‌, సంపత్‌, శ్రీనివాస్‌, గంగాధర్‌ తదితరులు పాల్గొన్నారు.

కార్యశాల పోస్టర్లు..

తెయూ(డిచ్‌పల్లి): శోధ్‌ తెలంగాణ ఆధ్వర్యంలో పరిశోధన అంశంపై నిర్వహించనున్న రెండు రోజుల కార్యశాలను సద్వినియోగం చేసుకోవాలని వీసీ యాదగిరిరావు సూచించారు. తెయూలో కార్యశాల పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. తెయూ శోధ్‌ కన్వీనర్‌ గుర్రపు శ్రీకాంత్‌ మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు కార్యశాలలో పాల్గొనేందుకు ఈ నెల 28వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

పరీక్ష ఫీజుల నోటిఫికేషన్‌ విడుదల

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని ఎం.ఎడ్‌ మొదటి సెమిస్టర్‌ (రెగ్యులర్‌) పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 26 లోపు ఫీజు చెల్లించాలని పరీక్షల నియంత్రణ అధికారి ప్రొ. సంపత్‌కుమార్‌ తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో వచ్చే నెల 2లోపు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

ఇద్దరికి ఒక రోజు జైలు

బోధన్‌టౌన్‌(బోధన్‌): బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన ఇద్దరు వ్యక్తులకు ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ బోధన్‌ సెకండ్‌క్లాస్‌ మేజిస్ట్రేట్‌ శేషతల్ప సాయి తీర్పు వెలువరించారు. పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఉద్మీర్‌గల్లీకి చెందిన హన్మంతు, రాకేశ్‌ బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతుండగా పట్టుకొని గురువారం కోర్టులో హాజరుపర్చగా జైలుశిక్ష విధించినట్లు తెలిపారు.

మహిళ ఆచూకీ లభ్యం

నిజామాబాద్‌ రూరల్‌ : రెండ్రోజుల క్రితం అదృశ్యమైన మహిళను కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ట్రెయినీ ఐపీఎస్‌ సాయికుమార్‌ గురువారం తెలిపారు. మండలంలోని గూపన్‌పల్లికి చెందిన సునీత(35) ఇంట్లో గొడవలతో రెండ్రోజుల క్రితం చెప్పకుండా వెళ్లిపోయింది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సునీత మొబైల్‌ సిగ్నల్స్‌ను ట్రేస్‌ చేసి, నిర్మల్‌ జిల్లా బాసరలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఆమెను తీసుకొచ్చిన అనంతరం కౌన్సిలింగ్‌ ఇచ్చినట్లు పేర్కొన్నారు.



టాటా.. బైబై

ఇంటర్మీడియట్‌ ద్వితీయ సంవత్సర పరీక్షలు గురువారం ముగిశాయి. పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు చివరి పరీక్ష పూర్తవ్వడంతో కేంద్రాల వద్ద ఆనందంతో ఎగిరి గంతులేశారు. ఇన్నాళ్లు కలిసి చదివి..ఇక మీదట ఉన్నత చదువుల కోసం ఎక్కడెక్కడికో వెళ్తామంటూ పలువురు కన్నీరుపెట్టుకున్నారు. హాస్టల్‌ విద్యార్థులు సామగ్రిని తీసుకొని ఇళ్లకు ప్రయాణమయ్యారు. –సాక్షి స్టాఫ్‌ ఫొటోగ్రాఫర్‌–నిజామాబాద్‌

ముగిసిన ఇంటర్‌ పరీక్షలు

- చివరి రోజు 438 మంది గైర్హాజరు

నిజామాబాద్‌అర్బన్‌: ఇంటర్మీడియట్‌ పరీక్షలు ముగిశాయి. చివరి రోజైన గురువారం ఇంటర్‌ సెకండియర్‌ కెమిస్ట్రీ, కామర్స్‌ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 15,896 మంది విద్యార్థులకు 15,458 మంది హాజరుకాగా, 438 మంది గైర్హాజరయ్యారు. 57 పరీక్ష కేంద్రాలకుగాను 52 కేంద్రాలను తనిఖీ చేసినట్లు జిల్లా ఇంటర్‌ విద్యాధికారి రవికుమార్‌ తెలిపారు. ఈనెల 5న పరీక్షలు ప్రారంభం కాగా, మొత్తం 14 మంది విద్యార్థులు డిబార్‌ అయ్యారు.

అధ్యాపకులను రిలీవ్‌ చేయాలి

ఈనెల 22 నుంచి మొదటి స్పెల్‌, 24 నుంచి రెండో స్పెల్‌, 26 నుంచి మూడో స్పెల్‌, 28 నుంచి నాల్గో స్పెల్‌ మూల్యాంకనం ప్రారంభమవుతుందని జిల్లా ఇంటర్‌ విద్యాధికారి రవికుమార్‌ తెలిపారు. మూల్యాంకనం విధులకు గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లు నిర్ణీత తేదీల్లో మూల్యాంకనం విధులకు సంబంధిత అధ్యాపకులను రిలీవ్‌ చేయాలని ఆదేశించారు. రిలీవ్‌ చేయని ప్రిన్సిపాల్‌లపై బోర్డు నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.





హాస్టల్‌ నుంచి పిల్లలను తీసుకొని వెళుతున్న కుటుంబసభ్యులు

ఆరు గ్యారంటీలను అమలు చేశాం

- అభివృద్ధిని ఓర్వలేకే విమర్శలు
- రూరల్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ భూపతిరెడ్డి



మాట్లాడుతున్న రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్‌ సిటీ: బడుగు, బలహీనవర్గాల అభివృద్ధి కాంగ్రెస్‌ పార్టీ ప్రధాన లక్ష్యమని నిజామాబాద్‌ రూరల్‌ ఎమ్మెల్యే డాక్టర్‌ ఆర్‌.భూపతిరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్‌ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తుందని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన 6 గ్యారంటీలను అమలుచేశామన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి చూసి ఓర్వలేని విపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఐదేళ్లలో హామీలు అమలు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే అమలు చేశామని పేర్కొన్నారు. 50 వేల ఎకరాలకు నీరందించే ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి కావాల్సిన నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్‌ మంత్రిని కోరినట్లు భూపతిరెడ్డి తెలిపారు. అప్పులు చేసైనా ఇచ్చిన హామీలు అమలుచేసి తీరుతామన్నారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌లో నిధులు కేటాయించినట్లు తెలిపారు. కేంద్రం నుంచి నిధులు తీసుకురావడంలో బీజేపీ కేంద్రమంత్రులు విఫలమయ్యారని అన్నారు. తెలంగాణకు నిధులను రాకుండా బీజేపీ మంత్రులు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. సమావేశంలో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ముప్ప గంగారెడ్డి, డీసీసీ డెలిగేట్‌ బాడ్సి శేఖర్‌గౌడ్‌, నాయకులు భూమారెడ్డి, రమేశ్‌, లింగం తదితరులు పాల్గొన్నారు.



వానర యుద్ధం

నిజాంసాగర్‌(జుక్కల్‌): కామారెడ్డి జిల్లా మహమ్మద్‌ నగర్‌ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల వద్ద గురువారం మధ్యాహ్నం రెండు గంటల పాటు వానరాల యుద్ధం బీభత్సం సృష్టించింది. గుంపులుగా ఉన్న వానరాలు గ్రూపులుగా విడిపోయి ఒకదానిపై ఒకటి తీవ్ర స్థాయిలో కలబడ్డాయి. రోడ్డుపై వానరాల యుద్ధంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వాటి అరుపులు, దాడులతో అక్కడి వాతావరణం దద్దరిల్లిపోయింది.

క్రైం కార్నర్‌

హత్య కేసులో ఒకరి రిమాండ్‌



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేశ్‌

బిచ్కుంద(జుక్కల్‌): హత్య కేసులో ఒకరిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నరేశ్‌ తెలిపారు. బిహార్‌కు చెందిన మనీష్‌ కుమార్‌, కుమార్‌లు మండలంలోని హజ్గుల్‌లో కూలీ పని చేస్తున్నారు. తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడనే అనుమానంతో మనీష్‌ను గతేడాది సెప్టెంబర్‌ 25న కుమార్‌ హత్య చేసి పరారయ్యాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. ఈ క్రమంలో గురువారం యజమాని వద్ద జీతం డబ్బులు తీసుకునేందుకు వచ్చిన కుమార్‌ను పట్టుకున్నామన్నారు. మనీష్‌ను హత్య చేసినట్లు విచారణలో ఒప్పుకోవడంతో కుమార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఎస్సై మోహన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

దొంగలను పట్టుకున్న గ్రామస్తులు

ఎడపల్లి (బోధన్‌): ఎడపల్లి మండలం ఠాణాకలాన్‌ గ్రామస్తులు గురువారం ముగ్గురు మహిళా దొంగలను పట్టుకున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఠాణాకలాన్‌కు చెందిన గిర్మారెడ్డి 15 రోజుల క్రితం ఇంటికి తాళం వేసి నిజామాబాద్‌లో ఉంటున్న తన కొడుకు వద్ద వెళ్లారు. గురువారం మధ్యాహ్నం చిత్తు కాగితాలు సేకరించేందుకు రెండు ఆటోల్లో వచ్చిన ఐదుగురు మహిళలు గిర్మారెడ్డి ఇంట్లోకి వెళ్లారు. చోరీ చేసిన సామగ్రిని మొదట ఒక ఆటోలో తరలించగా, మరో ఆటోలో మిగతా సామగ్రి తరలిస్తుండగా కాలనీవాసులు ముగ్గురు మహిళలను పట్టుకున్నారు. మరో ఇద్దరు మహిళలు అక్కడి నుంచి పరారయ్యారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మహిళలను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన మహిళల్లో ఇద్దరు బోధన్‌, ఒకరు రుద్రూర్‌కు చెందిన వారిగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీచందర్‌ రెడ్డి తెలిపారు.

సబ్‌స్టేషన్‌లో మంటలు



సబ్‌స్టేషన్‌లో చెలరేగుతున్న మంటలు

మాచారెడ్డి : పాల్వంచ మండలం ఫరీద్‌పేట గ్రామంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో గురువారం మంటలు చెలరేగాయి. వెంటనే తేరుకున్న సిబ్బంది సరఫరాను నిలిపివేసి మంటలను ఆర్పారు. ఎండవేడిమికి కెపాసిటర్లు కాలిపోవడంతో మంటలు అంటుకున్నట్లు విద్యుత్‌ సిబ్బంది తెలిపారు. అనంతరం కెపాసిటర్‌కు మరమ్మతులు చేసి విద్యుత్‌ సరఫరాను పునరుద్ధరించారు.

ఫైనాన్స్‌ కార్యాలయానికి నిప్పు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో జక్సాని శ్రీహరికి చెందిన ఫైనాన్స్‌ కార్యాలయ తలుపులకు బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్‌ పోసి నిప్పు పెట్టారు. గమనించిన స్థానికులు యజమానికి సమాచారం అందించి మంటలను ఆర్పివేశారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. కాగా, ఇదే కాలనీలో గతంలో ఓ ఇంట్లో బంగారు ఆభరణాలు అపహరించి దుండగులు బట్టలకు నిప్పు పెట్టి పారిపోయారు. మరోసారి అదేవిధంగా జరగడంతో కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు.

కిరాణా దుకాణం దగ్ధం

మాక్లూర్‌: మండలంలోని మదన్‌పల్లి గ్రామంలో గురువారం తెల్లవారుజామున ఓ కిరాణా దుకాణం కాలిబూడిదైంది. మదన్‌పల్లికి చెందిన అమ్ముల నాగరాజు జీవనోపాధి కోసం నెల రోజుల క్రితం గ్రామంలో ఓ మడిగెను అద్దెకు తీసుకొని కిరాణా దుకాణం నడుపుతున్నాడు. గురువారం దుకాణం పూర్తిగా దగ్ధం కాగా, అందులో ఉన్న సుమారు రూ.2 లక్షల విలువజేసే సరుకులు కాలిబూడిదయ్యాయి. విద్యుదాఘాతంతో జరిగిందా? ఎవరైనా నిప్పు పెట్టారా? అనేది తెలియడం లేదని బాధితుడు పేర్కొన్నాడు. ఈ విషయమై తహసీల్దార్‌, పోలీసులకు ఫిర్యాదు చేశామని నాగరాజు తెలిపారు.

పోలీసుల పేరిట డబ్బులు వసూలు.. యువకుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై సాయన్న

రెంజల్‌(బోధన్‌): టాస్క్‌ఫోర్స్‌ పోలీసునంటూ ఓ వ్యక్తిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన యువకుడిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రెంజల్‌ ఎస్సై సాయన్న తెలిపారు. ఈ నెల 17న నిజామాబాద్‌కు చెందిన రఫీక్‌ అనే వ్యక్తి తన ఆటోలో ధర్మాబాద్‌కు నూకలు, బియ్యం తరలిస్తున్నాడు. రెంజల్‌ మండలం కందకుర్తి బ్రిడ్జి వద్ద అదే గ్రామానికి చెందిన తానాజీ సతీశ్‌ తాను టాస్క్‌ఫోర్స్‌ పోలీసునంటూ ఆటోను ఆపాడు. రఫీక్‌ను బెదిరించి తనకు డబ్బులు ఇవ్వకపోతే ఆటోను సీజ్‌ చేస్తాననడంతో బాధితుడు రూ. 3 వేలు ఫోన్‌ పే చేశాడు. ప్రతినెలా రూ. 5 వేలు ఇవ్వాలని డిమాండ్‌ చేయగా రఫీక్‌ అంగీకరించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. చివరికి అనుమానం వచ్చి డయల్‌ 100కు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు డబ్బులు వసూలు చేసిన సతీశ్‌ ఓ యూట్యూబ్‌ చానల్‌లో విలేకరిగా పనిచేస్తున్నట్లు గుర్తించి రిమాండ్‌కు తరలించారు.

భిక్కనూరులో ఇద్దరిపై కేసు

భిక్కనూరు: విలేకరుల ముసుగులో డబ్బులు డిమాండ్‌ చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన లింగాల నవీన్‌ గౌడ్‌, అర్జున్‌ విలేకరులమంటూ డబ్బులు డిమాండ్‌ చేశారని భిక్కనూరులోని సిద్ధిరామేశ్వర మోటార్‌ షాపు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఇసుక తరలిస్తున్న వాహనాల సీజ్‌



పోలీసులు సీజ్‌ చేసిన వాహనాలు

మాచారెడ్డి : పాల్వంచ మండల కేంద్రంలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న లారీ, రెండు ట్రాక్టర్లను మాచారెడ్డి పోలీసులు గురువారం సీజ్‌ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై అనిల్‌ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మోపాల్‌లో పొక్లెయిన్‌, ట్రాక్టర్‌..

మోపాల్‌ : మండలంలోని బాడ్సి గ్రామ వాగులోంచి అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుపుతున్న పొక్లెయిన్‌, ట్రాక్టర్లను సీజ్‌ చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్‌ గురువారం తెలిపారు. బుధవారం అర్ధరాత్రి వాగులో ఇసుక తవ్వుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పట్టుకొని ఆరుగురిపై కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

రుద్రూర్‌లో రెండు టిప్పర్లు..

రుద్రూర్‌: మండలంలోని లక్ష్మీపూర్‌ క్యాంపు శివారులో బుధవారం రాత్రి రెండు ఇసుక టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో టిప్పర్లను పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు.